కొత్త శీర్షిక ప్రారంభం

# మల్లెమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకథలు

> ‘మామా మనకీ మాదిగ కులం ఎప్పడొచ్చింది? ఎట్ట పుట్టింది? రవ్వంత జెప్పరాదూ?’

మొన్నటెండల్లో సుందరమ్మ పెళ్ళంటే మా రావిగుంట పల్లెకి బోయినా. ఆయమ్మికి పెళ్ళనేకాడికి నాకొక పాట గుర్తుకొచ్చింది. ఆ పాట మా గూడెపోళ్ళు పాడతారు.

‘మల్లెమొగ్గల గొడుగు బట్టరే!
మగువా సుందరమ్మ కివుడు
మల్లెమొగ్గల గొడుగు బట్టరే!"

సుందరమ్మంటే నా మరదలు శాంతమ్మ కూతుర్లే. "బావా! మన సుందరమ్మ పెండ్లి. ఎట్టైన జేసి నువ్వు రావాల. మనోళ్ళంతా నిన్ను సూడాలంటున్నారు" అని కార్డు రాస్తే వూరికి బోయినావన్నమాట.

దేవయ్య కొడుకొచ్చిండని జెప్పి నా బావలు, తాతలు, చిన్నాయనలు, అత్తలు, మరదల్లు నన్ను చుట్టేసి వూపిరాడకుండ జేసింగ్రు.

"మా బావని నీళ్ళు నిప్పలు తాగనియ్యరా! అందరూ ఎగబడింగ్రు" అని శాంతమ్మ ఒక్కరువు అరిచేసరికి యాడోళ్ళు ఆడ బోయింగ్రు.

సంకటి తిని కానగచెట్టుకింద మలకమంచం వాల్చుకొని సందేల దాక ఒక నిద్దర తీసి లేసిన.

పెళ్ళికి రొం(డ్రో)జుల టైముంది కదా అనుకుని నేనా రేతిరికి లింగారెడ్డిపల్లెకి పయానమయ్యా. ఆ వూరికి మా మేనత్త నాగమ్మ నిచ్చినాము. ఆ వూరి పెదమాదిగ మల్లెల పిచ్చయ్య నాకు మామ



పెద మాదిగ మల్లెల పిచ్చయ్య

## జాంబమంతుడూ–పిచ్చిమామా!

వరస అవుతడు. ఎనభైయేళ్ళు దగ్గరపడ్డవోడు. ఈ వయసుకీ సంకటి ముద్దలూ, ముదుసుల వంజూ వుండితీరాల. పిచ్చిమామతో పిచ్చాపాటీ ఆయివాంక "మామా! మనకీ మాదిగ కులం ఎప్ప డొచ్చింది? ఎట్ట వుట్టింది? రవ్వంత జెప్పరాదూ!" అవడిగిన.

ఆయన కతలు కమ్మగ జెవుతడని నాకు తెలుసు.

* * *

జాంబమంతుడంటే ఎవరూ?
జగతికి ముందు బుట్టినోడు
మన జాతి చియ్య
ఆ కత జెవుతా గాని
మట్టసంగ ఇనుకో...

* * *

ఆదియందు ఎనిమిది కాళ్ళు, నాలుగు కండ్లు, నాలుగు సెవులు, రెండు తోకలు గలది వుండేది. దాని పేరు కామదేనువు. ఆ కామదేనువును ఇస్ను, ఈస్వరుడు, బమ్మ, తాతా జాంబుడు ఈ నలుగురూ దానికి బాగసాములు. దాని ఒళ్ళంతా అమ్రుతమంట. దాని పాలు తాగటం కాని, మజ్జిక సిలుక్కోటం గానీ ఈళ్ళే జేసేవోళ్ళంట. కానీ కామదేనువును మేవుకొచ్చేవాడు ఎవుడూ కనపడ్లా!

ఒకతూరి పార్వతీదేవి, ఈస్వరుడు రదమేసుకుని బోవటంలో దారిలో ఆయమ్మ బహిష్టయ్యింది. అంటే బయట జేరినాది అంటరు గదా! అదన్న మాట. అప్పడు ఆ మైలగుడ్డ అక్కడున్న సెన్నంగి సెట్లో బెట్టి మళ్ళీ కొత్త వస్త్రం కట్టుకోని దేస పరిపాలన కోసరం పొయ్యింది. పొయ్యి మళ్ళీ తిరిగి వచ్చేటవుడు ఆ సెన్నంగి సెట్టులో మైల గుడ్డలో అరుస్తున్నడు పిల్లవాడు. అప్పడు బర్తకు జెప్పింది.

"యేమి ప్రానవాదా! అదుగో అక్కడ సెట్టులో ఎవురో అరుస్తా వుండారు. దించు దించు రదం" అవేసరికి దిగిచూస్తే పిల్లవాడున్నడు.

ఈ పిల్లవాన్ని దీసకబోయి సాకింగ్రు వాళ్ళు. ఎవురూ? ఆ పార్వతీ పరమేస్వర్లు. ఆ పిల్లవాడు అంతయి ఇంతయి యింత పిల్లవాడు అయ్యే వరకి ఈ కామదేనువును సాకడానికీ, మేవుకోమ ఢానూ పెయత్నం జేసి పంవుతుండరు.

ఆ పిల్లోడికి మాత్రం ఈ అమ్రుతం గానీ, ఈ పాలు గానీ, ఈ మజ్జిగ గానీ యేమి బెట్టడంలా! మాడు చెక్కలూ, మంచినీళ్ళూ అంత ముంతలో బోసేదీ అదిచ్చి పంవుతున్నరు.

ఒకవాడు పొద్దువ "అవ్వా! అవ్వా! ఈ దినము నేను సాలా దూరం పాలగిరి కొండలకు కామదేనువును మేతకు తోలకపోవల. నాకు

సీకటితో అన్నంబెట్టు" అన్నడు.

ఆమె ఆ మాట మర్సిపోయి మజ్జిగ జేస్తున్నది. పిల్లవాడు మళ్ళీ అన్నం బెట్టమని అడిగిండు. ఈమె మజ్జిగ సేత్తోనే అన్నంబెట్టింది. ఆ అన్నము ముంతలో పోసుకునేటప్పుడు ఆమె చెయ్యి దగిలి ఒక మజ్జిగ చుక్క పిల్లోడి ముంతలో బడింది. అది అమ్రుతం. ఆ అన్నం తిన్నంక అది వాడి తలకెక్కింది. ఊహు! యిదేదో ఏతువే! అను కున్నడు. సాయంత్రానికొచ్చి "అవ్వా! నువ్వు అడితప్పనిదానివి. పైకి బొంకన్దానివి. పతివర్తవు. కానీ రోజూ బెట్టే అన్నము గాదు యియ్యాల నువ్వు నాకు బెట్టింది. ఇయ్యాల బహు రుచిగా వున్నదే! అదేందో నిజము జెప్పమ" ని సత్యము గోరిండు.

"నాయనా! నువ్వు మేపే కామదేనువు పాలు మాత్రం ఇస్తాది. ఆ పాలు కాంచి, అయి సల్లా రిననక కొంతసేమిరి యేసినాను. అయ్యిమాత్రం మజ్జిగ జిలికినాను. ఆ మజ్జిగ ఒక్క సుక్క మాత్రం నీ ముంతలో బడినాది. అంతేగానీ ఇంకేమీ లేదు" అని జెప్పినాది.

"అన్నీ సమానమేనయ్యా!" అని జాంబమంతుడు చెప్పిండు. అళ్ళు మూడుసార్లు మళ్ళీ అడిగితే మూడుసార్లూ కువ్వ సమానంగానే వుందన్నాడు.

అప్పుడాళ్ళు మూడు కువ్వలూ ఎత్తుకొని ఎల్లి పోయిండ్రు. ఇంగ మిగిలిన ఈ కువ్వను తోల్లో యేసుకోని కాళ్ళూ, తలకాయ మూటగట్టుకోని బడితక్కట్టుకోని పట్రా పిల్లోడా అని మూట ఆ పిల్లోడికిచ్చిండు.

వాడు కాసంత దూరం దెచ్చేది అడ పడదెగ్గేది. నాకో ముక్క బెట్టు తాతా! నేను కాల్చుకోని తినిగాని రానని మొండికేసేది. అట్లా అడవిలో గుండా వచ్చేదాయె. "నీ యమ్మను దెన్గా?" అని కసురుకొని ఒక కండ తుంప యిచ్చిండు.

ఇంగ ఆ పిల్లవాడు అగ్గి సంచి దీసి నిప్పజేసి ముక్కను కాల్చుకుండేసరికి సెరసెర సెరా వాసన బాకి ఇస్సుకూ ఈస్వరుడికీ, బమ్మకూ సంగతి తెల్సిపోయింది. అప్పుడు అళ్ళు తిరిగి ఆ అరణ్యంలోకే మళ్ళీ ఆ మూడు కువ్వలూ ఎత్తుకొని వచ్చి తియ్యి తాతా! తియ్యిమన్నరు. కువ్వల్ని

**—ఎండ్లూరి సుధాకర్**

ఇంగ ఆ పిల్లోడు యేం మాట్లాడకుండ అగ్గి సంచి దీసి జేబులో యేసుకున్నడు. కామదేనువును దీసుకున్నడు. తోలుకోని బోయినాడు. పొయ్యి, సెట్టుకు కట్టేసినాడు. నాలుగు కాళ్లు గట్టి, కూడు పారబోసి ముంతలోకి పాలు పిండుకుని తాగినాడు.

"అహహ! ఈ పాలే యింత అమ్రుతంగ వుండయ్యే! దీని మాంసం ఎట్లుండొచ్చు"నని అనుకునేతలికి అంబా! అని అరిచి ఆవు సచ్చి పోయింది. దీని మాంసం ఎట్టుంటదో ఆనేమాట యినేవరకి సచ్చిపోయిందది.

అప్పుడు పిల్లవాడు తిరిగి జాంబమంతుడి కాడికి వచ్చిండు. "తాతా! కామదేనువు సచ్చిపోయినాది" అన్నడు.

అప్పుడు జాంబమంతుడు కత్తి ఆరే దీసుకోని ఇస్సు, ఈస్వర, బమ్మను ముగ్గుర్ని తీసుకొని, ఈ పిల్లవాన్ని "ఎక్కన్నో సాయ్యా! సూపిత్తువు పదమని" నలుగురు పయానమై అక్కడికి బొయ్యినారు. ఇంగ ఆ వంతవే జాంబమంతుడు కామదేనువును కోసినాడు. పోగులు బోసినాడు. దాన్ని నాల్గు బాగాలేసినాడు. తాసుగట్టి తూసిండు.

"ఏం తాతా! ఎవరి కువ్వ తక్కువ" అని ముగ్గురూ అడిగిన్రు.

ఎప్పటాలా తాసులో తుయ్యమన్నరు. తూసేవరకి వాళ్ళ మూడు కువ్వలు సమానం గుండయ్యి. ఆ నాలుగో కువ్వ బెట్టి తూచేవరకి అది తగ్గింది.

"తాతా! ఈ కువ్వ ఎవురిది?" అన్నరు ముగ్గురూ. "అయ్యా! నా కువ్వ తక్కువుండాది" అన్నాడు జాంబమంతుడు.

మళ్ళీ తూసిండ్రు. మూడుసార్లు అదే పెకారం అడిగేసరికి నా కువ్వే తక్కువన్నడు.

"తాతా! నీ కువ్వ తగ్గినందుకు ఈ దినం మంచి నీ కులం తక్కువ"

"అయితే జాంబమంతా! ఒక గోర వరాకలి యుగం వుట్టబోతున్నది. అప్పుడు మాత్రం నువ్వీ గొడ్డును జెరవాల. దీని తోలును నువ్వు ఊనాల, నువ్వు పాదరచ్చలు గుట్టాల. అయితే మాత్రం నీ పాదరచ్చల్ని ఎంతటోల్లైనా దేవుడి దగ్గర జేరి మాడునంటుకోవాల" అని వాళ్లు దీవించి పైకి బొయ్యినారంట.

"జగతికి ముందు బుట్టినవాడు జాంబమంతుడు అంటరే ఏమి లాబం? ఇంగ ఆ రోజునుంచి ఆ తాత సంతానం సెప్పులు కుడతా వుండాది. మనం కుట్టిన సెప్పుల్తోనే ఈ పపంచకం మన మాడువ కొడతా వుంది" అని ముగించాడు పిచ్చిమామ.



